# నూతి బైట కప్పలు

రెండున్న రయింది.

జుట్టులోంచి క్రిందికి జారిన చెమట "ఏంజిల్ ఫేస్"లో అద్దిన చెక్కిలి పాడుచెయ్యకుండా కర్చీఫ్‌తో అద్దుకొంటూ, "ఇట్స్ రియల్లీ హాట్ యార్" అంది సుమిత్ర.

ప్రేమ అవునన్నట్టు తలూపి, చుట్టూ పరికించి చూసింది.

బాల్కనీ బుకింగు దగ్గర క్యూ చాంతాడులా వుంది. అయిదు బెల్‌బాటమ్స్, ఒక గొట్టం. మళ్ళీ రెండు బెల్ బాటమ్సూ, ఓ పైజామా... ఇలా సాగిపోయింది. దానికి పక్కనే ఆడవాళ్ళ గుంపుంది. భారతదేశంలో స్త్రీ యింకా అబలే అన్న విషయాన్ని బలపరుస్తున్నట్టుగా ఆ గుంపు మొగవాళ్ళతో పోలిస్తే తక్కువగా వుంది.

"టిక్కెట్లు దొరుకుతా యంటావా ?" అడిగింది సుమిత్ర.

"అటో టిక్కెట్టూ, ఇటో టిక్కెట్టూ యిస్తారుగా-దొరకొచ్చు" అంది ప్రేమ.

హాలు కాంపౌండ్‌లోకి జనం చీమల్లా వస్తున్నారు. సోడావాడు ఎడతెరిపి లేకుండా కొడ్తూనే వున్నాడు. క్రింద తరగతి బుకింగ్ దగ్గర ఏదో గొడవ జరుగుతోంది.

హాలు ముందంతా రంగురంగుల కాగితాలు అంటించేరు. పైన చిన్నచిన్న బల్బులు అమర్చేరు "హౌస్‌ఫుల్" బోర్డు వెనక్కి తిప్పిపెట్టి వుంచేరు, తప్పకుండా దాని అవసరం పడుతుందని తెలిసినట్టు. నిలువెత్తు బ్రూస్‌లీ బొమ్మ హుందాగా వుంది.

ప్రేమ అటూ ఇటూ చూస్తోంది.

మెయిన్‌గేటు కవతల రోడ్డుంది. రోడ్డుకి అవతలివైపు కిళ్ళీ కొట్టు వుంది. దాని ముందు రెండు చిన్న బల్లలు వున్నాయి.

కిళ్ళీకొట్టు బల్లమీద కూర్చుని కొట్టువాడితో సరసాలాడుతోంది ఓ పిల్ల. వాడు కసిరికొడుతున్నా కదలకుండా అక్కడే నిలబడి నవ్వుతోంది. వాడు కూడా అంత బలంగా కసిరికొట్టడంలేదు, నవ్వుతూనే వున్నాడు. అది అరటివళ్ళ గెలమీద చెయ్యి వేసినప్పుడల్లా లాగిపారేస్తున్నాడు.

"వాళ్ళ నేమంటారో తెలుసా ?"

ఏమంటా రన్నట్టు చూసింది సుమిత్ర.

"రోడ్ సైడ్ బిచెస్."

ఇంకోసారి అటు చూసి, కళ్ళు తిప్పుకుంటూ "టైమెంతయింది" అని అడిగింది.

"పావుతక్కువ మూడు"

"అనాటమీ ప్రొఫెసరొచ్చుంటాడు."

"మనిద్దరం లేకపోవటంతో అనుమానం వచ్చే వుంటుంది—"

"అంతమందిలో తెలుస్తుందా పాడా-"

"రాగానే వాడి కళ్ళు మనకోసమే వెతుకుతాయి."

సుమిత్ర మొహం చిట్లించి "పోనిద్దూ, గద్ద ముక్కు మొహమూ, వాడూనూ" అంది.

"ఈ ఒక్క సంవత్సరమూ యెలానో ఒకలా గట్టెక్కేస్తే..." అంది ప్రేమ.

"ఈ ఇయరే కష్టం."

"అందమయిన అమ్మాయిలకి ప్రతి సంవత్సరమూ కష్టమే—"

"ఏం—"

"అంత తొందరగా వదిలిపెట్టటానికి ప్రొఫెసర్లు ఒప్పుకోవద్దూ—" నవ్వింది.

"అటు చూడు" అంది ప్రేమ అకస్మాత్తుగా.

సుమిత్ర చప్పున అటు చూసింది.

కిళ్ళీకొట్టు దగ్గరికి ఓ రిక్షావాడు చేరేడు. ఆ పిల్ల వాడితో యేదో మాట్లాడుతోంది. అరిటి గెల చూపిస్తోంది. కిళ్ళీకొట్టువాడు నవ్వుతున్నాడు. రిక్షావాడు యేదో అంటున్నాడు. కొట్టువాడు వంగేలోపులోనే అది గెల నుంచి ఓ ఆరు, యేడు పళ్ళు తీసుకొని పక్క పాకలోకి పరుగెత్తింది.

రిక్షా వాడు జేబులోంచి డబ్బుతీసి కొట్టువాడి కిచ్చి పాకవైపు నడిచేడు.

"ఇవ్వదర్థమైందా— వాళ్ళని రోడ్ సైడ్ బిచ్‌లని ఎందుకన్నారో—" అంది ప్రేమ.

ఏదో వింత చూస్తున్నట్టు నిలబడిపోయిన సుమిత్ర బిగపట్టిన వూపిరి వదుల్తూ, "మైగాడ్—" అంది నమ్మలేనట్టు.

"ఏం- ఇటువంటి విషయాలు కథల్లో ఎప్పుడూ చదవలేదా?" అంది ప్రేమ.

"మరీ యింత పబ్లిగ్గానా..."

స్నేహితురాలికి విషయమూ-సబ్జెక్టూ అసలు తెలీదని తెలియగానే ఇంట్రస్టు పెరిగింది. "ఇంకా చీప్‌గా వుంటార్ట. అరగ్లాసు టీ కోసం—" అని యేదో చెప్పబోతూ వుంటే, "ప్లీజ్... డోన్టాక్ ఎబౌట్ దోజ్ రాటెన్ థింగ్స్ ఐ సే-" అంది వారిస్తున్నట్టు.

ఇంతలో ఒక రెండేళ్ళ కుర్రవాడు, వంటి మీద బట్టల్లేనివాడు-అస్థిపంజరంలా వున్నవాడు, తల్లి లోపలికి వెళ్ళటం చూసి, గుడిసె దగ్గరకు పరిగెత్తుకుంటూ వెళ్ళి, మూసి వున్న తలుపుల్ని బాదసాగేడు. వాడి వళ్ళు తారులా నల్లగా వుంది. వాడిపొట్ట, తినటమే ధ్యేయంగా పెట్టుకున్న శేట్‌జీ పొట్టలాగా బాగా వుబ్బి వుంది- ఆకల్తో రోగ నిరోధకం తగ్గిపోయి కాలేయం పెరగటంవల్ల!

వాణ్ణి చూసి, కిళ్ళీకొట్టువాడు నవ్వుతూ ఏదో అరుస్తూ

న్నాడు. వాడు వినకుండా తలుపులు బాదుతూనే వున్నాడు.

"వాడు దాని కొడుకు. చూసేవా సెంటిమెంటు ఎలా 'ప్లే' చేస్తుందో" అంది సుమిత్ర.

'...ఆకలే ముఖ్యం కాదు మనిషికి...'

తాము అటు చూడటం ఎవరూ చూడటంలేదని నిశ్చ యించుకొని, అటు చూస్తోంది ప్రేమ.

ఇంతలో తలుపు కొద్దిగా తెరుచుకొని ఓ చెయ్యి బైట కొచ్చింది. రెండు అరటిపళ్ళని వాడి కందించి, ఎంత స్పీడుగా వచ్చిందో, అంత స్పీడుగా వెళ్ళిపోయింది. తలు పులు మూసుకున్నాయి.

నోటమాట రానట్టు నిలబడిపోయే రిద్దరూ.

కిళ్ళీకొట్టు చెక్కకి ఆనుకుని, నేల మీద కూర్చుని తింటున్నాడు వాడు.

ప్రేమ ముందు తేరుకుంది. "చూసేవా ? ఆకలి మని షిని ఎంతకయినా దిగజారుస్తుంది" అంది ఈసారి.

"నే నొప్పుకోను" అంది సుమిత్ర అటువైపు నుంచి కళ్ళు తిప్పుకుంటూ.

ఎవరి గొడవలో వాళ్ళున్నారు. అంతా రణగొణ ధ్వనిగా వుంది. అందరి మొహాల్లోనూ విసుగు కనిపిస్తోంది. సోడాలవాడు కొడ్తూనే వున్నాడు. కిళ్ళీలవాడు గొంతు చించుకుని అరుస్తున్నాడు. అడుక్కుతినే వాళ్ళని అడుక్కు తినేవాడిలా వున్న దౌర్భాగ్యుడు ఒక్కొక్కళ్ళ దగ్గరా నిల బడి ముట్టుకుని మరీ డబ్బులు అడుక్కుంటున్నాడు.

"ఆ అరటిపళ్ళ కోసం ఆడది శీలాన్ని అర్పితం చేసు కుంటోందంటే— ఇట్స్ ఆఫ్ఫుల్."

ప్రేమకీ ఈ దృశ్యాన్ని ఇలా మొదటిసారి చూడటం వల్ల కొత్తగానే వుంది. కానీ స్నేహితురాలు అలా మాట్లా డింది కాబట్టి, సంభాషణ పొడిగించటానికి "నే చెప్పేనుగా— ఆకలని..." అంది, ఆ విషయం మీద సర్వం తెలిసినట్టు.

"ఎంత ఆకలయితే మాత్రం...ఇంత పబ్లిగ్గా— మిట్ట మధ్యాహ్నవ్వూట..." అంది సుమిత్ర. "కనీసం రాత్రి వరకూ ఆగొచ్చుగా, ఎండలో ఆ రిక్షావాడి చెమటా అదీ... ఉఫ్...హారిబుల్ ఊహించుకుంటేనే కడుపులో తిప్పుతోంది"

"ఇలాంటి వాళ్ళ మూలానే ఆడదంటే 'చీప్' అనే అభిప్రాయం మొగవాళ్ళకి కలుగుతోంది."

"పోన్లెద్దూ వెధవ టాపిక్..." అంది సుమిత్ర. జనం యింకా ప్రవాహంలా వస్తూనే వున్నారు. సైకిళ్ళు పక్కగా పెట్టి క్యూలో చేరిపోతున్నారు.

"టిక్కెట్టు దొరుకుతుందంటావా ?"

"అనుమానవేఁ" అంది ప్రేమ చుట్టూ చూస్తూ.

ఇంతలో బుకింగ్ తెరిచారు. అంతవరకూ క్యూలో వున్న జనం ఒక్కసారిగా చెదిరి బుకింగ్ కిటికీని చుట్టు ముట్టారు. క్రమశిక్షణ బెదిరి పారిపోయింది. ఆ తొక్కిడికి బలహీనులు బయట కొచ్చేశారు.

ఆడవాళ్ళందరూ దూరంగా ఓ గుంపుగా నిలబడ్డారు. బుకింగ్ వాడు టిక్కెట్లు చకచకా ఇస్తున్నాడు. గుంపులోంచి

ఒకరొకరే బైటికి వస్తున్నారు. క్యూ దాదాపు చెదిరి పోయింది. గుంపు లోపలికి దూరలేనివాళ్ళు బయట నిలబడి టిక్కెట్టు తీసుకొని వస్తున్నవాళ్ళని కసిగా చూస్తున్నారు. చూస్తుండగానే సగం టిక్కెట్లయిపోయాయి.

"పోదావాః" అంది సుమిత్ర అటే చూస్తూ.

ప్రేమ మాట్లాడలేదు. బుకింగు నుంచి బయట కొచ్చిన వాళ్ళు ఆడవాళ్ళని చూసుకుంటూ హాల్లోకి వెళ్తున్నారు.

క్రింది తరగతి టిక్కెట్లు అయిపోయినట్టున్నాయి. వాళ్ళూ వచ్చి, గుంపులోకి దూసుకుపోతున్నారు. ఆడవాళ్ళ లోంచి కొందరు అప్పుడే వెళ్ళిపోవటానికి సన్నద్ధులవు తున్నారు.

"అరగంట క్రిమినల్ వేస్ట్" అంది సుమిత్ర. "అదీ ఎండలో__"

"వేస్టే నంటావా ?" స్నేహితురాలి వైపు చూడ కుండానే అంది ప్రేమ.

"ఇంకా నీకు హోప్సున్నాయా ?"

అతడి చేతిలో టిక్కెట్టూ, పెదవుల మీద విజయ గర్వంతో కూడిన నవ్వూ వున్నాయి. వంటి రంగుకీ, జుట్టు రంగుకీ పెద్ద తేడా లేకపోవడంతో, చెమట నుదుటి మీద పట్టిందో జుట్టులోంచి కారిందో తెలియటంలేదు. వెనుక జేబులోంచి దువ్వెన తీసి దువ్వుకొని, లోపలికి వెళ్ళబోతూ, అతడు యదాలాపంగా తమవైపు చూసేసరికి, ప్రేమ పెద వులు విడీ విడనట్టు నవ్వి 'ప్లీజ్' అన్నట్టు చూసింది అర్థిస్తు

న్నట్టు.

అతను ఆగి, తననేనా అన్నట్టు చూసేడు క్షణంపాటు. ఆ క్షణంలోనే వది రూపాయలనోటు అందిస్తూ, "ఇఫ్ యూ డోంట్ మైండ్" అంది తియ్యగా.

"ఓ— ష్యూర్" అంటూ హుషారుగా ఆమె చేతి లోంచి నోటు అందుకుని మళ్ళీ గుంపులోకి జొరబడ్డాడు అతడు. ఐదు నిమిషాల్లో అతను జనాన్ని తోసుకుంటూ బయటకొచ్చేడు. ప్రపంచాన్ని గెలిచినట్టూ వున్నాడు. బనీన్ భుజం దగ్గిర కొద్దిగా చినిగినట్టుంది. అప్పుడే దువ్విన క్రాపు మళ్ళీ చెదిరిపోయింది. వీటిని దేన్నీ లక్ష్యపెట్టకుండా దగ్గర కొచ్చి, టిక్కెట్లు అందించేడు.

"చాలా థ్యాంక్సండీ" తియ్యగా అంది ప్రేమ.

"నో మెన్షన్ ప్లీజ్" చూపుడు వేలితో జుట్టు పైకి తోసుకున్నాడు.

ఇద్దరూ హాలులోకి నడిచారు.

"నిజంగా నీ ధైర్యానికి మెచ్చుకోవాలి" అంది సుమిత్ర.

"ఆం... మెడికల్ కాలేజీలో చదువుతూ ఆ మాత్రం ధైర్యం లేకపోతే ఎలా... అవసరం మనది."

"దొరక్కపోతే మాత్రం చాలా డిజప్పాయింట్ అయి వుండేవాళ్ళం."

ఇద్దరూ కారిడార్‌లోకి వెళ్ళేరు. అతడు టిక్కెట్టు అందిస్తూ కావాలని చెయ్యి తగిలించగా అంటిన చెమటని,

'యార్డ్‌లీ' పౌడర్ అద్దిన చేతి రుమాల్తో సుతారంగా తుడుచుకుంటూ, "ఇట్స్ రియల్లీ హాట్ యార్" అంది ప్రేమ.

"వియ్ విల్ హ్యావ్ కోకో కోలా బాస్"

ఆ తరువాత ఇద్దరూ ఆ కారిడార్ చివరే వున్న డ్రింక్స్ టేబిల్ దగ్గిరికి నడిచేరు.

నూతిబైటి కప్ప కూపస్థ మండూకాన్ని చూసి జాలి పడుతుంది. కానీ నీళ్ళు ఎక్కడయినా ఒకటే! ఆరు అరటి పళ్ళ కోసం అంటిన చెమటకన్నా రెండు సినిమా టిక్కెట్ల కోసం అంటిన చెమట ఏ విధంగా మిన్న?